కిక్ బాక్సింగ్ పోటీల్లో అక్షయ్‌కుమార్ జోషి ప్రతిభ

ఖైరతాబాద్, అక్టోబర్ 17 : అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీల్లో క్రీడాకారుడు అక్షయ్ కుమార్‌జోషి పతకాల పంట పండించాడు. అమీర్‌పేటకు చెందిన అక్షయ్ కుమార్ జోషి తెలంగాణ కిక్‌బాక్సింగ్ పోటీల్లో బంగారు, రజత పతకాలు, గోవాలో జరిగిన వాకో ఇండియా నేషనల్ కిక్‌బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించారు. తాజాగా ఈనెల 6 నుంచి 13 వరకు కంబోడియాలోని సమ్‌షేన్‌లో జరిగిన ఆసియా కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో రజత పతకం సాధించి రాష్ట్ర కీర్తిని చాటాడు.

20న కేబీఆర్ పార్కు వద్ద ప్రజాసంబరాలు

కేబీఆర్ పార్కువద్ద సైకిల్ ర్యాలీలో పాల్గొన్న జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి తదితరులు

బంజారాహిల్స్, అక్టోబర్ 17: కేబీఆర్ పార్కు వద్ద ఈనెల 20న నిర్వహించనున్న ప్రజాసంబరాలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి పిలుపునిచ్చారు. గురువారం కేబీఆర్ పార్కువద్ద ప్రజా సంబరాల సైకిల్ ర్యాలీని జోనల్ కమిషనర్ ప్రారంభించి మాట్లాడారు. కేబీఆర్ పార్కు చుట్టూ వాక్‌వేలో పర్యావరణ పరిరక్షణ, సంస్కృతీ సాంప్రదాయాలపై వేడుకలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పర్యావరణ ప్రేమికులు, విద్యార్థులు, వాకర్లు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్కిల్-18డీఎంసీ ప్రశాంతి, ఏఎంహెచ్ డాక్టర్ భార్గవ్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

- నివాళులర్పించిన పోలీస్ అధికారులు, ప్రజాప్రతినిధులు

బండ్లగూడ, అక్టోబర్ 17 : తెలంగాణ పోలీస్ అకాడమీ ఏకశిలా బ్లాక్‌లో గురువారం మహర్షి వాల్మీకి జయంతి నిర్వహించారు. పలువురు పోలీస్ అధికారులు వాల్మీకి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ ఎన్. వెంకటేశ్వర్లు, సునీత, కృష్ణప్రసాద్, ఆదూరి శ్రీనివాసరావు, జగదీశ్వరావు, కృష్ణ, తిరుపతి, బాలయ్య, గోపు శ్రీను,ఏఓ వెంకట శేఖర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. మేయర్ లతాప్రేమ్‌గౌడ్ వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నార్సింగి మున్సిపల్ కార్యాలయంలో..

మణికొండ : నేటి యువత వాల్మీకి మహర్షి ఆశయసాధనలో ముందుకు సాగాలని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణాశ్రీనివాస్ అన్నారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకుని గురువారం నార్సింగి మున్సిపాలిటీ కార్యాల యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. అన్నివర్గాల సమాన అభివృద్ధే కాంగ్రెస్ సర్కారు ప్రధాన ఉద్దేశమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అధికారికంగా వాల్మీకి జయంతి నిర్వహిస్తున్నద న్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణ మోహన్‌రెడ్డి,మేనేజర్ యోగేశ్‌నాయక్, ఏఈ శ్రీనివాస్, ఆర్ఐ అఖిల్, అకౌంటెంట్ కృష్ణయ్య, మున్సిపల్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పోలీస్ అకాడమీలో వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పోలీస్ అధికారులు

నార్సింగి మున్సిపాలిటీ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో..

ప్రతి ఇంట్లో సులభంగా యజ్ఞం చేసుకోవచ్చు..

- 'ఇంద్ర యజ్ఞం' పుస్తకావిష్కరణలో అడిషనల్ డీసీపీ శ్రీనివాస్‌రావు



చిన్న అనంతగిరి ఆలయంలో ఇంద్రయజ్ఞం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అడిషనల్ డీసీపీ శ్రీనివాస్‌రావు తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి, అక్టోబర్ 17:ప్రజలంతా సులభ రీతిలో యజ్ఞ మహోత్సవాలు నిర్వహించుకోవాలని అడిషనల్ డీసీపీ శ్రీనివాస్‌రావు, చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ విద్యాసాగర్‌రెడ్డి అన్నారు. అత్తాపూర్ డివిజన్ రాంబాగ్‌లోని చిన్న అనంతగిరి శివాలయంలో గురువారం 'ఇంద్ర యజ్ఞం' పుస్తకాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల, వర్ణ, ప్రాంత వివక్ష లేకుండా ప్రజలంతా ఇంటి వద్ద సులభంగా యజ్ఞం చేసుకునేందుకు వీలుగా ఈ పుస్తకాన్ని రూపొందించారని అన్నారు. ప్రతి ఇంట్లో ఇంద్ర యజ్ఞం జరగాలని ఆకాంక్షించారు. కాగా ఈ పుస్తకంలో యజ్ఞ విధానాలు, మంత్ర భావములతో సహ గణపతి ముని ప్రసాదించిన ఇంద్రయజ్ఞం వివరించినట్లు గ్రంథకర్త సూర్య ఫణిమాధవ్ వెల్లడించారు. అనంతరం ప్రజలందరితో ఇంద్ర యజ్ఞం చేయించారు. రాష్ట్రీయ సేవికా సమితి నుంచి గౌడ రమాదేవి, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నుంచి రమావిశ్వనాథన్, గాయత్రీ తపోవనం ఆశ్రమ శిష్యులు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలల్లో 67 మంది టీచర్ల నియామకం

జూబ్లీహిల్స్,అక్టోబర్ 17 : ప్రభుత్వ పాఠశాలలు కొత్త టీచర్లతో కళకళలాడుతున్నాయి. ఖైరతాబాద్ జోన్‌లోని ప్రాథమిక పాఠశాలకు 67 మంది కొత్త టీచర్లు వచ్చారు. ఖైరతాబాద్-1 మండలంలో 16 మంది, ఖైరతాబాద్-2 మండలంలో 17, షేక్‌పేట్ మండలంలో 34 మంది ఉపాధ్యాయులు నియామకమయ్యారు. ఖైరతాబాద్ జోన్ జిల్లా ఉప విద్యాధికారి శ్యామ్యూల్‌రాజ్ ఆధ్వర్యంలో డిప్యూటీ ఐఓఎస్‌లు పరమేశ్వరమ్మ, యాదగిరి,శ్రావణ్‌కుమార్ టీచర్లకు కౌన్సిలింగ్ ప్రక్రియను పూర్తిచేశారు. అనంతరం టీచర్లకు ప్రాథమిక విద్య కార్యాలయాల్లో అధికారులు పాఠశాల కేటాయింపుపత్రాలు అందజేశారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

నారాయణగూడలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హిమాయత్‌నగర్, అక్టోబర్ 17: విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడితే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, సహాయ కార్యదర్శి దామర కిరణ్, నగర కార్యదర్శి అశోక్‌రెడ్డి హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్స్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం నారాయణగూడలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్స్, స్కాలర్‌షిప్ బకాయిలు సుమారు 8300 కోట్లకు పైగా ఉన్నాయని వాటిని విడుదల చేయకుండా ప్రభుత్వం ఉదాసీన వైఖరిని అవలంభిస్తుందన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. తక్షణమే ఫీజు బకాయిలను విడుదల చేయాలని లేనిపక్షంలో సచివాలయం, ప్రగతి భవన్‌లను ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నిరసనలో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు లెనిన్‌గువేరా, ఉపాధ్యక్షుడు స్టాలిన్, నేతలు నాగేందర్, ప్రశాంత్, చరణ్, సహన, భగత్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పీఆర్ హిల్స్ ఉమ్మడి బస్తీల డెవలప్‌మెంట్ ఫెడరేషన్

జూబ్లీహిల్స్,అక్టోబర్17ః ఎస్‌పీఆర్ హిల్స్ ఉమ్మడి బస్తీల డెవలప్‌మెంట్ ఫెడరేషన్ సొసైటీ అధ్యక్షుడిగా మహాత్మానగర్ వ్యవస్థాపకుడు జేపీ జ్ఞానేశ్వర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. గురువారం జరిగిన కమిటీ సమావేశంలో దివంగత నేత పీజేఆర్ హయాంలో ఏర్పాటైన కమిటీని పునరుద్ధరిస్తూ నూతన కార్యవర్గాన్ని నియమించుకున్నట్లు వెల్లడించారు. రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి ఆధ్వర్యంలో బస్తీ వాసుల సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు వారు తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్ల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

సీడీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ కన్వీనర్ డప్పు ప్రవీణ్‌కుమార్ తదితరులు

మణికొండ, అక్టోబర్ 17 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అంగన్‌వాడీ టీచర్ల జీవితాలు అస్తవ్యస్తంగా మారాయని గండిపేట మండల సీఐటీయూ కన్వీనర్ డప్పు ప్రవీణ్‌కుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం అంగన్‌వాడీ టీచర్ల సమస్యలపై సీడీపీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్లకు ఐదు నెలల వేతనాల్లో సగం మాత్రమే చెల్లించి మిగిలినవి పెండింగ్‌లో పెట్టారన్నారు. పూర్తి వేతనం చెల్లించేలా ఆర్థికశాఖ ట్రెజరీలో అప్డేట్ చేయాలని, అంగన్‌వాడీ టీచర్లకు హెల్పర్లను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కారు అధికారం చేపట్టిన తర్వాత అన్ని కష్టాలే ఎదురవుతున్నాయన్నారు. దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీ పోస్టులను సైతం భర్తీ చేయడం లేదని, దాంతో అంగన్‌వాడీ టీచర్లపై పనిభారం పడుతుందని పేర్కొన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పెండింగ్ వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో షబీనా బేగం, సంధ్యారాణి తదితరులు ఉన్నారు.

డబుల్ గృహాలను సందర్శించిన హౌసింగ్ అధికారులు

- సమస్యలను విన్నవించిన ఇందిరానగర్ ఇండ్ల యజమానులు

నోడల్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న డీబీ అనిల్, డబుల్ ఇండ్ల యజమానులు

ఖైరతాబాద్, అక్టోబర్ 17 : ఖైరతాబాద్ ఇందిరానగర్ డబుల్ బెడ్రూం గృహ సముదాయాన్ని గురువారం అధికారుల బృందం సందర్శించింది. సోషల్ ఆడిట్ పబ్లిక్ హియరింగ్ ఆఫ్ పీఎంఏవై-యూ పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి, హౌసింగ్ విభాగం డిప్యూటీ ఈఈ శ్రావణ్‌కుమార్ నేతృత్వంలో సిటీ లెవల్ టెక్నికల్ సెల్ విభాగం సిబ్బంది సమస్యలను తెలుసుకున్నారు. డబుల్ బెడ్రూమ్ ఇండ్లలో సమస్యలు, యజమానులు పడుతున్న ఇబ్బందులు, కావాల్సిన మౌలిక సదుపాయాల వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఇందిరానగర్ 2బీహెచ్‌కే డిగ్నిటీ హౌజింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డీబీ అనిల్ పలు సమస్యలపై అధికారులకు వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా తాగునీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని, సరిపోను రావడం లేదని పేర్కొన్నారు. 210 గృహాలకు ఒకటే బోరు ఉందని, ఒక పవర్ బోర్ అవసరమన్నారు. నాలుగు బ్లాకులకు కలిపి 4 ఓవర్ హెడ్ ట్యాంక్‌లు ఉన్నాయని, మరో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించాలన్నారు.

విద్యుత్ అంతరాయాల నివారణకు సోలార్ పవర్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని విన్నవించారు. రోడ్డును విస్తరించాలని తెలిపారు. పాత అడ్రసులు కాకుండా ఆధార్ కార్డు ఆధారంగా జీహెచ్ఎంసీ డోర్ నంబర్లు కేటాయించాలన్నారు. లిఫ్టులకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాలని కోరారు. పార్కింగ్ స్థలంలో వరద నీరు చేరకుండా విండ్ షీల్డ్ వంటిది ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ బిల్లుల్లో కొంత సబ్సిడీ ఇవ్వాలని పలువురు అధికారులను కోరారు.

ప్రజాసమస్యలపై స్పందించిన అధికారులకు సన్మానం



మణికొండ జలమండలి జనరల్ మేనేజర్ నాయక్‌ను సత్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మణికొండ, అక్టోబర్ 17 : మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ నాయకులు విశేష కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీ పరిధిలోని డాలర్‌హిల్స్‌కాలనీ, ఖిజ్రాకాలనీ వద్ద నీటిని పంప్ చేసేందుకు నిర్మించిన బూస్టర్ వినియోగానికి సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్ లేక అవస్థలు పడుతున్నామని స్థానికులు బీఆర్ఎస్ నాయకుల దృష్టికి తెచ్చారు. ఈ విషయాన్ని బీఆర్ఎస్ మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ధన్‌రాజు, నాయకులు ఉపేంద్రనాథ్ రెడ్డి, అందె లక్ష్మణ్ తదితరులు జలమండలి శాఖ ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా విన్నవించారు. స్పందించిన జలమండలిశాఖ 18వడివిజన్ జనరల్ మేనేజర్ నాయక్ సమస్యను పరిష్కరించారు. ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించిన జలమండలిశాఖ అధికారులు, సిబ్బందిని గురువారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముత్తంగి లక్ష్మయ్య, కిరణ్, ప్రవీణ్, రమేశ్, కృపాకర్,ఆరిఫ్, అష్వక్ అలీ, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి మాస్టర్ మైండ్స్ 7 లక్షల విరాళం

సిటీబ్యూరో, అక్టోబర్ 17(నమస్తే తెలంగాణ) : మాస్టర్ మైండ్స్ విద్యార్థి కొత్తపేట తేజశ్వినిని ఇటీవల ప్రకటించిన సీఎంఏ ఫైనల్ ఇయర్ ఫలితాల్లో ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించింది. ఈ మేరకు తేజస్వినిని ఆంధ్రప్రదేశ్ సచివాలయంలోని ముఖ్య మంత్రి కార్యాలయంలో సీఎం చంద్రబాబు సత్కరించినట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులను ఉత్తమ ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్న మాస్టర్ మైండ్స్ సిబ్బందిని ఆయన అభినందించినట్టు పేర్కొన్నారు.

అనంతరం మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థల అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ ముఖ్య మంత్రి సహాయనిధికి రూ. 7 లక్షలను అందజేశారు.

20న పద్మశాలీ దసరా మేళాకు తరలండి..

నారాయణగూడలోని పద్మశాలీ భవన్‌లో బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దుశ్యంతల తదితరులు

హిమాయత్‌నగర్, అక్టోబర్17: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన పద్మశాలీ మహిళలకు అన్ని పార్టీలు ప్రాధాన్యం కల్పించి సీట్లు కేటాయించాలని అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ మహిళా అధ్యక్షురాలు వనం దుశ్యంతల కోరారు. పద్మశాలీ సంఘం ఎల్‌బీనగర్ సర్కిల్ ఆధ్వర్యంలో ఈ నెల 20న ఆటోనగర్‌లోని హరిణవనస్థలి అనన్య ఎకో పార్క్ ఆవరణలో జరిగే 22వ పద్మశాలీ దసరా మేళాకు పద్మశాలీలంతా తరలిరావాలని ఆమె పిలుపునిచ్చారు. మేళాకు సంబంధించిన బ్రోచర్‌ను గురువారం నారాయణగూడలోని పద్మశాలీ భవన్‌లో ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నామినేటేడ్ పదవుల్లో పద్మశాలీ మహిళలకు అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గుంటక, రూప, జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, నగర అధ్యక్షురాలు శారద, సంధ్యారాణి, గణేశ్, రవితేజ, శ్రావణ్, లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల చోరీ కేసులో నిందితుల అరెస్ట్

బంజారాహిల్స్,అక్టోబర్ 17: జూబ్లీహిల్స్ పెద్దమ్మగుడి భక్తులే లక్ష్యంగా సెల్‌ఫోన్ చోరీలకు పాల్పడుతున్న యువకుడితోపాటు వాటిని కొనుగోలు చేసిన మరో వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. జూబ్లీహిల్స్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ మధుసూధన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఫతేనగర్ వడ్డెరబస్తీలోని మోరీపంక ప్రాంతానికి చెందిన యువకుడు కొమ్మిరె మొర్లిన్ అలియాస్ మెర్రీ(19) ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడి మొర్లిన్ కొంతకాలంగా సెల్‌ఫోన్ చోరీలకు పాల్పడుతున్నాడు. ఇటీవల జూబ్లీహిల్స్ పెద్దమ్మగుడి భక్తుల సెల్‌ఫోన్లు మాయం చేస్తున్నాడు. ఫిర్యాదులు అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీ సాయంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో ప్రశ్నించగా మొత్తం 7 సెల్‌ఫోన్లు చోరీ చేసినట్లు అంగీకరించాడు. వాటిని బాలానగర్ సమీపంలోని సాయినగర్‌కు చెందిన సెల్‌ఫోన్ మెకానిక్ రాయలపురం వెంకటేశ్(30)కు అమ్మానని, వారిద్వారా యుగంధర్, రేణుక అనే వ్యక్తులు కొన్నారని తెలిపాడు. దీంతో నిందితుడు మొర్లిన్‌తో పాటు ఫోన్లు కొన్న వెంకటేశ్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు వారివద్ద 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఫోన్లు కొన్న మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

రాజేంద్రనగర్ కళాశాలలో 'నారద క్విజ్' పోటీలు

క్విజ్ పోటీలకు పెద్ద సంఖ్యలో హాజరైన విద్యార్థులు

బండ్లగూడ అక్టోబర్ 17: రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం 'నారద క్విజ్' పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. కళాశాల ఆవరణలో ఈ పోటీలను ప్రిన్సిపాల్ సుధారాణి, వైస్ ప్రిన్సిపాల్ శ్యామ్‌సుందర్, క్విజ్ బోర్డు ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. మారుతున్న కాలానికనుగుణంగా నెక్స్ట్ జనరేషన్, నారద టీవీ నిర్వహిస్తున్న ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో విద్యార్థులు పాల్గొని తమ జ్ఞానాన్ని మరింత పెంచుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మురళి, నవీన్ తదితరులు పాల్గొనగా విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

'మూసీ' బాధితులకు అండగా ఉంటాం..

- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

భరత్‌నగర్‌లో 'మూసీ' బాధితుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, అక్టోబర్ 17: ప్రజలు కష్టపడి కట్టుకున్న ఇండ్లను కూల్చేస్తే చూస్తూ ఊరుకోబోమని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. అత్తాపూర్ డివిజన్ పరిధిలోని మూసీ పరీవాహక ప్రాంతమైన భరత్‌నగర్ కాలనీ, టీకేఆర్ కాలనీల్లో ఇండ్లకు హైడ్రా అధికారులు మార్కింగ్ చేశారు. ఆయా ప్రాంతాలను గురువారం ఎంపీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. మూసీ నది పరీవాహక ఇండ్ల బాధితులకు అండగా ఉంటామన్నారు. పేదలు కష్టపడి సంపాదించుకున్న డబ్బుతో ఇండ్లు నిర్మించుకుంటే వాటిని కూలగొట్టే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. కొత్తగా వచ్చి మార్కింగ్ చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ విషయమై కోర్టు ద్వారా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రజల ఆస్తి నష్టానికి మూడు రెట్ల పరిహారం ఇచ్చి ఆ తరువాతే ఇక్కడికి రావాలన్నారు. న్యాయం జరిగేంత వరకు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన పేర్కొన్నారు. ఎవరూ అధైర్య పడవద్దని బీజేపీ బాధితులందరికీ అండగా ఉంటుందన్నారు. సమావేశంలో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, వై.శ్రీధర్, కొమురయ్య, గౌరీశంకర్, కన్వీనర్ మల్లేశ్‌యాదవ్, వేణుగోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అమర్, స్టార్ చిన్నముదిరాజ్, కాలనీల వాసులు పాల్గొన్నారు.

మాంసం వ్యర్థాలను రోడ్లపై వేస్తే క్రిమినల్ చర్యలు

బంజారాహిల్స్,అక్టోబర్ 17: ఇటీవల నగరంలో చోటుచేసుకుంటున్న మతపరమైన ఉద్రిక్తతల నేపథ్యంలో మాంసం వ్యాపారులు, లాడ్జిల నిర్వాహకులతో జూబ్లీహిల్స్ పోలీసులు ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో పీఎస్ పరిధిలోని చికెన్, మటన్, బీఫ్ షాపులు, లాడ్జిల నిర్వాహకులతో ఇన్‌స్పెక్టర్ కే.వెంకటేశ్వర్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల మాసబ్‌ట్యాంక్ చెత్త కుప్ప వద్ద వేసిన మాంసం వ్యర్థాలను కుక్క తీసుకెళ్లి అమ్మవారి మండపంలో వేయడం, అనంతరం మతపరమైన ఉద్రిక్తతలు తలెత్తిన విషయాన్ని వివరించారు. మాంసం దుకాణాల యజమానులు వ్యర్థాలను సరిగా ప్యాక్ చేసి డంపింగ్ యార్డ్‌కు తరలించాలని, రోడ్లపై, చెత్తకుప్పల్లో వేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

జూబ్లీహిల్స్ పీఎస్‌లో మాంసం విక్రయదారులతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో విక్రేతలకు సూచనలు చేస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

లాడ్జిల యజమానులు కస్టమర్లకు గదులు ఇచ్చే ముందు వారి పూర్తి వివరాలు తీసుకుని పోలీసులకు అందించాలని పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తులపై వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలని కోరారు. సమావేశంలో డీఐ మధుసూధన్, ఎస్సైలు హరీశ్వర్‌రెడ్డి. జానయ్య తదితరులున్నారు.

మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో..

వెంగళరావునగర్ : మాంసం వ్యర్థాలను రోడ్లపై పడేస్తుండటంతో సమాజంలో అశాంతి చెలరేగే ప్రమాదం ఉందని మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చికెన్, మటన్, బీఫ్ వ్యాపారులతో పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. మాంసం వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయడం వల్ల ప్రజాశాంతికి భంగం అవకాశం ఉందన్నారు. ఒక సంచిలో ప్యాక్ చేసి జీహెచ్ఎంసీ వాహనాలకు అందించాలని ఆయన సూచించారు. సమావేశంలో డీఐ రవికుమార్,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

శబరిమలకు పాదయాత్ర

బండ్లగూడ, అక్టోబర్ 17 : బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ముత్యంరెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో గురువారం వంద మంది మాలధారులు మహాపాదయాత్రగా శబరిమల పుణ్యక్షేత్రానికి బయల్దేరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పద్మావతీపాపయ్య యాదవ్ వారికి మెడికల్ కిట్‌లను పంపిణీ చేసి పాదయాత్రను ప్రారంభించారు.

పీహెచ్‌సీల్లో 'స్పెషలిస్ట్' హెల్త్ క్యాంపులు

- రోజూ ఒక స్పెషలిస్ట్ డాక్టర్‌తో ప్రజలకు వైద్య సేవలు

జూబ్లీహిల్స్,అక్టోబర్ 17 : ప్రభుత్వ దవాఖానల్లో స్పెషలిస్ట్ హెల్త్‌క్యాంప్‌లు నిర్వహించేందుకు వైద్యాధికారులు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రతిరోజూ ఒక స్పెషలిస్ట్ డాక్టర్ వైద్యసేవలం దించనున్నారు. పేద, సామాన్య ప్రజల ఆదరణ పొందిన పీహెచ్‌సీల్లో సాధారణ వైద్యం మాత్రమే అందుబాటులో ఉండగా ఇకపై వారంలో ప్రతిరోజు ఒక్కో స్పెషలిస్ట్ డాక్టర్‌తో రోగులకు మరింత నాణ్యమైన వైద్య సేవలం దించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు జిల్లా వైద్యాధికారి పర్యవేక్షణలో అన్ని పీహెచ్‌సీలలో ప్రత్యేక హెల్త్ క్యాంప్‌లు ఏర్పాటు చేయనున్నారు. గైనకాలజిస్ట్‌లు, పిడియాట్రిక్, ఈఎన్‌టీ, డెంటల్, ఆర్థోపెడిక్ తదితర సమస్యలకు స్పెషలిస్ట్ డాక్టర్‌లు వైద్య సేవలందించనున్నారు. వైద్యవిధాన పరిషత్ పరిధిలోని కమ్యునిటీ హెల్త్ సెంటర్‌లలో సేవలందిస్తున్న స్పెషలిస్ట్ వైద్యులతో ఈ ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. ఆరోగ్